
# "మేము ఎస్‌టి కాదా"?



నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక
సంపుటి : -13 సంచిక : 132 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
24-03-2026 మంగళవారం వెల : 1/- పేజీలు : 4
























**ఇది 20 ఏళ్లుగా గిరిజనుల హక్కులను బహిరంగంగా కాలరాస్తున్న వ్యవస్థ వైఫల్యం**
**"మేము ఎస్‌టి కాదా?" అని చిన్నారులు అడుగుతున్నా సమాధానం చెప్పలేని అధికార యంత్రాంగం,**
**పాత రికార్డులు చేతిలో ఉన్నా గుర్తింపు ఇవ్వని నిర్లక్ష్యం,**
**ప్రభుత్వాలు మారినా మారని నిరాదరణ**
**ఇవన్నీ కలిపి శ్రీకాకుళం జిల్లాలో గిరిజన కుటుంబాల జీవితం నరకంగా మార్చాయి**

- చిన్నారుల ప్రశ్నలకు సమాధానం ఎక్కడ?
- గిరిజనుల హక్కులు ఎక్కడ?
- 20 ఏళ్లుగా కులం లేక నరక యాతన
- శ్రీకాకుళం గ్రీవెన్స్‌కు వచ్చిన గిరిజన కుటుంబాలు...
- ఎండలోనే గంటల తరబడి వేచిఉన్న చిన్నారులు
- పాత రికార్డులు ఉన్నా కుల ధృవీకరణ ఇవ్వని అధికారులు
- ఓసీగా మార్చి హక్కులు కోల్పోతున్న ఎస్‌టి కుటుంబాలు
- విద్య, ఉద్యోగాలు, పథకాలన్నీ దూరమవుతున్న దుస్థితి
- జిల్లా పరిషత్ వద్ద నిరసన... అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- ప్రభుత్వాలు మారినా సమస్య మారలేదు... అందరూ బాధ్యత తప్పించుకున్నారనే విమర్శలు
- ఇంకా స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిక
- ఇది కేవలం కుల ధృవీకరణ సమస్య కాదు...

**(నవతరం ప్రతినిధి, శ్రీకాకుళం):**

20 ఏళ్లుగా న్యాయం కోసం తలుపులు తట్టుకుంటున్న గిరిజన కుటుంబాలు చివరికి జిల్లా పరిషత్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఆశ్రయించాయి.
కానీ అక్కడ కూడా ఎదురైన దృశ్యాలు హృదయ విదారకంగా మారాయి. తీవ్ర ఎండలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు గంటల తరబడి కూర్చొని తమ వంతు కోసం ఎదురు చూడాల్సి వచ్చింది.
పాఠశాల యూనిఫాం ధరించిన చిన్నారులు నేలపై కూర్చుని, తమ భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్న దృశ్యాలు అక్కడి ప్రతి ఒక్కరిని కదిలించాయి.
కానీ వ్యవస్థ మాత్రం కదలలేదు.

## "మా కులం ఎక్కడ?" సమాధానం లేని ప్రశ్న

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులు కూడా తమ కుల ధృవీకరణ లేక ఇబ్బందులు పడుతున్నారు.
"మేము ఎస్‌టి కాదా?" అనే అమాయక ప్రశ్న ఇప్పుడు వ్యవస్థపై తీవ్ర అభియోగంగా మారింది.
సమాధానం చెప్పాల్సిన వారు మౌనం వహించగా, భవిష్యత్తు కోసం ఎదురు చూస్తున్న పిల్లల కళ్లలో నిరాశ మాత్రమే కనిపిస్తోంది.

## ఆధారాలు ఉన్నా... న్యాయం లేదు

2005కు ముందు ఉన్న పాత రికార్డులు, 2011 జనగణన వివరాలు, పాఠశాల నమోదు పత్రాలు అన్నీ ఉన్నా కూడా అధికారులు కుల ధృవీకరణ ఇవ్వకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కొన్ని చోట్ల ఎస్‌టి స్థానంలో "ఓసీ"గా మార్చడం ద్వారా గిరిజనుల రాజ్యాంగ హక్కులను బహిరంగంగా హరించబడుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు.
ఆధారాలు చేతిలోనే... అయినా అన్యాయం కొనసాగుతోంది. గిరిజన కుటుంబాల వద్ద ఇప్పటికే ప్రభుత్వమే జారీ చేసిన పాత కమ్యూనిటీ, నేటివిటీ సర్టిఫికెట్లు స్పష్టమైన ఆధారాలుగా ఉన్నాయి.
రెవెన్యూ శాఖ నుంచే, అప్పటి తహసీల్దార్ల సంతకాలతో "ఎస్‌టి (యెనిటి కొండ్స్)"గా గుర్తిస్తూ జారీ చేసిన ఈ పత్రాలు ఇప్పటికీ అమలులోనే ఉన్నాయి.
అంటే ఒకప్పుడు ప్రభుత్వం స్వయంగా ఎస్‌టిగా గుర్తించిన కుటుంబాలనే, ఇప్పుడు అదే వ్యవస్థ "ఎస్‌టి కాదు" అంటూ తిరస్కరించడం తీవ్రమైన విరుద్ధతగా మారింది.
పాత రికార్డులు, అధికారిక సర్టిఫికెట్లు, ప్రభుత్వ ధృవీకరణలు అన్నీ చేతిలో ఉన్నప్పటికీ, ప్రస్తుతం అధికారులు వాటిని పక్కన పెట్టి నిర్ణయాలు తీసుకోవడం గిరిజనుల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది.
"ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్‌కే విలువ లేకపోతే... ఇక మేము ఎవరిని నమ్మాలి?" అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు.?

## ప్రభుత్వాలు మారినా... బాధ అదే

ఏ ప్రభుత్వం వచ్చినా గిరిజనుల సమస్యలపై మాటలు మాత్రమే వినిపించాయి కానీ, పరిష్కారం మాత్రం కనిపించలేదు.
గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం ఎవ్వరూ ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోలేదని బాధితులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.
ఎన్నికల సమయంలో హామీలు... తర్వాత పూర్తిగా నిర్లక్ష్యం ఇదే గిరిజనుల అనుభవమని చెబుతున్నారు.?

## గ్రీవెన్స్ కూడా ఫలించకపోతే... ప్రజలు ఎక్కడికి వెళ్లాలి?

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమం కూడా ఇలాంటి దృశ్యాలకు వేదిక కావడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.
ఎండలో చిన్నారులను కూర్చోబెట్టి, గంటల తరబడి వేచి పెట్టే పరిస్థితి రావడం వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనంగా మారింది.?

## ఇంకా మౌనం ఉంటే... ఉద్యమం మిన్నంటుతుంది

ఇప్పటికైనా జిల్లా అధికారులు తక్షణం స్పందించి, పాత రికార్డులను పరిగణనలోకి తీసుకుని నిజమైన ఎస్‌టి కుటుంబాలకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఈ సమస్యను జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమంగా మార్చి, తమ హక్కుల కోసం పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఎడిటోరియల్

# కల్తీ ముప్పు!

మొన్న సికింద్రాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ దాడుల్లో రెండువేల ఆరువందల కిలోల నకిలీ పన్నీర్ పట్టుబడింది. తీగలాగితే డొంక కదిలినట్టుగా దీని ఆధారంగా మరికొన్నిచోట్ల తనిఖీలు చేయగా మరో మూడువేల కిలోల పన్నీర్ దొరికింది. ఈ పన్నీర్‌ను హోటళ్లు, క్యాటరింగ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. తయారీలో రసాయనాలు, నాణ్యతలేని పదార్థాలు ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు. నిన్న జియాగూడలో డెబ్బయి రెండు డ్రమ్ముల కల్తీ పచ్చడి పట్టుకున్నారు. అంతకుముందు కూడా పలుచోట్ల చేసిన సోదాల్లో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్, కల్తీ మిర్చిపొడి, పసుపు, గడువు ముగిసిన ఆహారపదార్థాలు పట్టుబడ్డాయి.

ఈ వరుస ఘటనలతో నగరంలో ఆహారభద్రతపై ఆందోళన మొదలైంది. ఈ యాంత్రిక జీవనంలో చాలామంది హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దీన్నే ఆసరగా చేసుకున్న అక్రమార్కులు కల్తీదందాకు యథేచ్ఛగా తెరలేపుతున్నారు. పండగ సీజన్‌లలో ఇది మరీ ఎక్కువగా ఉంటోంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఏం చేస్తోందన్నదే ఇక్కడ ప్రశ్న. ఎవరో సమాచారమిస్తే తప్ప నేరుగా పట్టుకోలేని నిద్రావస్తలో అధికార యంత్రాంగం ఉండటం శోచనీయం!

ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న కల్తీ ఆహార దందాలను ప్రజల ఆరోగ్యంపై పెరుగుతున్న దాడిగానే భావించాలి. రోజువారిగా వినియోగించే ఆహారపదార్థాల్లోనే నకిలీ, కల్తీ పదార్థాలు కలిపి విక్రయించడం సామాన్య ప్రజల జీవన భద్రతకు సవాల్‌గా మారింది. పాలు, నెయ్యి, నూనెలు, మసాలాల వంటి ఎక్కువ అవసరమైన వస్తువులే కల్తీకి గురవుతున్న పరిస్థితి నెలకొంది. భారీ స్థాయిలో నకిలీ ఆహార పదార్థాలను నిల్వచేసి ఉంచడంలో కేవలం వ్యాపారుల దురాశే కాకుండా, ఇందులో ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే క్రూరత్వం కూడా కనిపిస్తోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలనుకునే ఆశతో కొంతమంది నాణ్యతను పూర్తిగా పక్కనపెట్టి ప్రమాదకరమైన రసాయనాలను ఉపయోగించడం అత్యంత ప్రమాదకరం. రసాయనాలు కలిపిన పచ్చళ్లు, నిల్వ కోసం వాడే హానికర పదార్థాలు, కృత్రిమ రంగులు ఇవన్నీ శరీరంపై నెమ్మదిగా విషంలా పనిచేస్తాయి. జీర్ణసమస్యలు, కాలేయ వ్యాధులు, క్యాన్సర్ వరకు దారితీసే ప్రమాదం ఉంది. పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం కలిగిస్తాయి. ఫుడ్ పాయిజన్ కేసులు పెరగడానికి కూడా ఆహార పదార్థాలలో నాణ్యత లేకపోవడమే ప్రధాన కారణం. ఇంకా పలుచోట్ల చేసిన తనిఖీల్లో మూడు వేల కిలోల కల్తీ నెయ్యి పట్టుబడింది. పదకొండు వందల కిలోలకు పైగా కల్తీ జింజర్-గార్లిక్ పేస్ట్ స్వాధీనమైంది. వీటిలో సిట్రిక్ యాసిడ్, ఇతర రసాయనాలు కలిపి తయారు చేసి హోటళ్లకు సరఫరా చేస్తున్నట్టు వెల్లడైంది. జియాగూడలో నకిలీ పచ్చళ్ల కేంద్రంపై చేసిన దాడిలో పాడైన కూరగాయలు, అతి తక్కువ నాణ్యత గల పదార్థాలతో తయారు చేస్తున్నట్టు నిర్ధారణ అయింది. బోరబండ, సికింద్రాబాద్‌లో పెద్దస్థాయిలో అనధికార యూనిట్లు, గోదాములు బయటపడటం చూస్తే ఇదంతా వ్యవస్థీకృత మాఫియాలా కనిపిస్తోంది. ఇది కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే కాదు, సమాజానికే ముప్పుగా మారుతోంది. కల్తీ ఆహారం కేవలం నాణ్యత సమస్యే కాదు, అది నేరపూరితం.

ఇది ప్రభుత్వ పర్యవేక్షణ లోపమే తప్ప వేరేకాదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే అధికార యంత్రాంగం హడావిడి చేస్తుంది తప్ప, దీనికి శాశ్వత పరిష్కారం చూపడటం లేదు. దాడులు జరిగినప్పుడు తప్ప, ఆ తర్వాత యథావిధిగా సాగడం పరిపాటిగా మారింది. బీఎన్ఎస్, ఫుడ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం కల్తీ ఆహారం లేదా డ్రింక్స్ అమ్మితే కనీసం ఆరునెలల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించాలి. తీవ్రమైన అనారోగ్యానికి గురైనా, ప్రాణపాయం ఏరపడినా జైలు, లేదా జీవితఖైదు విధించే అవకాశం ఉంది. ఈ లెక్కన ఎంత మందిని శిక్షించారు? ఎన్ని కేసులు నమోదు చేశారు? వేళ్లపై లెక్కకట్టేలా కూడా ఉండవంటే అతిశయోక్తికాదేమో!

ఇలా చూస్తే పచ్చళ్లు, పేస్ట్‌లు వంటి రోజువారి ఆహార పదర్థాలన్నీ కల్తీకి గురవుతున్నాయి. అంటే, మన ప్లేట్‌లో పడే ప్రతిపదార్థం కూడా ఇప్పుడు అనుమానాస్పదంగా మారుతోంది. ఇందులో వినియోగదారుల పాత్రను కూడా తీసిపారేయలేం. తక్కువ ధరల ఆశతో నాణ్యత లేని ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఈ నకిలీ దందాను మనమే ప్రోత్సహిస్తున్నట్టు అవుతోంది. సరైన ప్రమాణాలు ఉన్న ఉత్పత్తులను ఎంపిక చేయడం, ప్యాకింగ్ తయారీ తేదీ, ఎఫ్ఎస్ఎస్ఎఐ గుర్తించడం, తయారీ లేబుళ్లను గమనించడం అత్యంత అవసరం. కల్తీ ఆహార దందాను అరికట్టాలంటే కేవలం దాడులు సరిపోవు. కఠినమైన శిక్షలు వేగవంతమైన న్యాయప్రక్రియ, ప్రజల్లో అవగాహన- ఈ మూడు కలిసొస్తేనే ఫలితం ఉంటుంది. లేదంటే 'కల్తీ ఆహారం' అనే ముప్పు మన సమాజాన్ని నిశ్శబ్దంగా కబళిస్తూనే ఉంటుంది.

# పార్టీ బలపడటానికి శిక్షణ తరగతులు అత్యంత కీలకం

- ఉపాధ్యాయ శిక్షణ తరగతులకు హాజరైన బిజెపి కార్యకర్తలు...
- అంత్యోదయ స్ఫూర్తితోనే ముందుకు సాగుతున్నాయి
- బిజెపి పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపు



**నవతరం -టెక్కలి**

గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పార్టీ బలపడటానికి పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ తరగతులు అత్యంత కీలకమని ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) పేర్కొన్నారు. మండలంలోని స్థానిక ఐతం కళాశాలలో బిజెపి నాయకుల ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభియాన్ -2026 శిక్షణ తరగతులు రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శక్తివంతమైన సంస్థాగత నిర్మాణానికి, సైద్ధాంతిక బలోపేతానికి కీలక వేదికగా నిలిచింది. ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఈఆర్ పాల్గొని కార్యకర్తలకు సమగ్ర మార్గదర్శనం చేస్తూ, పార్టీ సిద్ధాంతాలు, కార్యచరణ, ప్రజాసేవ దృక్పథం పై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన "ఏకాత్మ మానవ దర్శనం" బీజేపీ యొక్క ప్రాథమిక సిద్ధాంతమని తెలిపారు. ఈ శిక్షణ సిద్ధాంతం మనిషిని కేవలం ఆర్థిక కోణంలో కాకుండా శారీరం, మనస్సు, బుద్ధి, ఆత్మల సమగ్ర సమన్యాయంగా చూడాలని సూచిస్తుందని వివరించారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలని లక్ష్యంగా పెట్టుకున్న అంత్యోదయ భావనను ప్రతి కార్యకర్త తన ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి యొక్క సిద్ధాంతక పునాదులు ఆయన హిందుత్వ, సంస్కృతిక జాతీయ వాదం, జాతీయ సమగ్రత, సామాజిక న్యాయం, ఆర్థిక సమతుల్యత వంటి అంశాలపై కార్యకర్తలకు సవరంగా వివరించారు. ఈ సిద్ధాంతాలు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా సమాజ అభ్యున్నతికి ద్రోహదపడే మార్గదర్శకాలని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణతో, నిబద్ధతతో, సేవ భావంతో పనిచేస్తేనే పార్టీ బలపడుతుందని, ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం దిశగా కృషి చేయాలని తెలిపారు. ఇలాంటి క్రమశిక్షణయుత శిక్షణ సాంప్రదాయం నేటికీ బీజేపీకి అతిపెద్ద సంస్థాగత నిర్మాణానికి బలం అని, అదే పార్టీ విజయాలకు మూల కారణమని అన్నారు.

ప్రతి కార్యకర్త ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అట్టాడ రవిబాబ్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, సంపతరావు నాగేశ్వరరావు, రాజేశ్వరి, మండల అధ్యక్షులు జర్జాన రాంజీ, జిల్లా ఉపాధ్యక్షులు నడుపురి లక్ష్మీనారాయణ, కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు, తదితర బిజెపి నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యం... మందసలో టీడీపీ సమావేశం

- స్థానిక ఎన్నికలపై దృష్టి
- బూత్ స్థాయి నుంచి బలోపేతం పిలుపు
- ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలు



**నవతరం -మందస**

రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మందస మండల టీడీపీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, కార్యదర్శి సాలీనా మాధవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో పనిచేస్తూ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. మై టీడీపీ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలను నమోదు చేయాలని తెలిపారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు పాల్గొన్నారు.

# ఆదివాసీల అభ్యున్నతికి కృషి

## ఎస్ టి కమీషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జి రెడ్డి



**నవతరం -మెలియాపుట్టి**

గిరిజన ప్రాంత సమస్యలు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించి ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎస్ టి కమీషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జి రెడ్డి అన్నారు. పాత పట్నం నియోజక వర్గం మెలియాపుట్టి మండల కేంద్రంలోని ఓ కళ్యాణ మండపంలో గిరిజన సమస్యలు పరిష్కారానికి వినతులను సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి తల్లిని నమ్ముకుని జీవనాన్ని సాగిస్తున్న గిరిజన సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి ప్రాధాన్యతా క్రమంలో సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివాసీల సంక్షేమ, అభివృద్ధితోపాటు సమస్యలు పరిష్కారానికి గిరిజనుల ఆకాంక్ష మేరకు మెలియాపుట్టి మండల కేంద్రంగా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఏ)ను ఏర్పాటు చేసే దిశగా తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. ఆదివాసీల సమస్యలు పరిష్కరించకునేందుకు అవగాహన పెంపొందించుకోవాలని తద్వారా సమష్టి కృషితో గిరిజనాభివృద్ధికి ముందడుగు వేయాలని ఆయన సూచించారు. గిరిజన ప్రాంతాల్లో భూ సమస్యలు పరిష్కరించాలని, రహదారి సౌకర్యం మెరుగుపరచాలని, సాగు చేస్తున్న భూములకు భూ యాజమాన్య హక్కులు కల్పించాలని, ఇళ్ళు మంజూరు చేయాలని పలువురు వినతి పత్రాలు అందజేశారు. వినతులను తక్షణమే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఎస్ టి కమీషన్ చైర్మన్ ఆదేశించారు.

వినతులు ఇలా...

కొండపై నుండి ప్రవహిస్తున్న నీటిని నిల్వ చేయుటకు చెక్కు డ్యామ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మండలంలోని భరణికోట పంచాయతీ జక్కర వీధి కి చెందిన రమేష్, పలువురు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. మందసా మండలం చీపి గ్రామ పంచాయతీ బుడారి సింగి రెవెన్యూ పరిధిలోని వారసత్వంగా సాగు చేస్తున్న భూమిని భూ పట్టాలు పంపిణీ చేసి గిరిజనులకు న్యాయం చేయాలని గిరిజన ఐక్యవేదిక మందస మండలం అధ్యక్షులు ఎస్. నీలకంఠం పలువురు గిరిజనులు కోరారు. గిరిజనులకు జీవనాధారమైన జీడి పంట సాగు చేస్తున్నందున మండలంలోని మర్రిపాడు పంచాయతీ దబ్బ గూడ రెవిన్యూ పరిధిలో డిపట్టాలు మంజూరు చేయాలని గిరిజనులు కోరారు. జీవనోపాధి కోసం మెడికల్ ల్యాబ్ ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించాలని మండలంలోని ఆంపురం గ్రామానికి చెందిన గిట్టింగి జోగారావు కోరారు. కుమారునికి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి చికిత్స కొరకు బసవ తారక రామ ఆసుపత్రిలో అవకాశం కల్పించాలని మామిడి గుడ్డి గ్రామానికి చెందిన జె.రాంప్రసాద్ అర్జీ అందజేశారు.

# డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా ఉద్యమం అవసరం




- భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా చైతన్య కార్యక్రమం
- డ్రగ్స్ సమాజాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారి
- ప్రజలే ముందుకు వచ్చి అడ్డుకోవాలని పిలుపు

**నవతరం -ఎచ్చెర్ల**

డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా సమాజం మొత్తం ఉద్యమించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. అమ్మన్నాయుడు అన్నారు. చిలకపాలెం వద్ద డ్రగ్స్ వ్యతిరేక చైతన్య కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 23న భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా యువతలో త్యాగస్ఫూర్తిని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సమాజాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారిగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యసనానికి బలైన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, సమాజం మొత్తం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నెల్లూరులో డ్రగ్స్ వ్యతిరేకంగా చైతన్యం కల్పించిన యువనాయకుడు కె. పెంచలయ్యను మాఫియా గ్యాంగ్ క్రూరంగా హత్య చేయడం దారుణమని ఖండించారు. పాలకులు ఒకవైపు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ, మరోవైపు అడ్డుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. మాదక ద్రవ్యాలు క్యాన్సర్ కంటే ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రజలు, కార్మికులు కలిసి డ్రగ్స్ వ్యాపారాన్ని అడ్డుకోవాలని, పెంచలయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ. సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అమర వీరులకు అక్షర విస్ఫోటనం..!




**1931 మార్చి 23**
రక్తం రాసిన రగిలే చరిత్ర..!
చరిత్ర గుండెలో పేలిన అగ్నిగుండం..!

లాహోర్ జైలు...
ఇనుప గోడల మధ్య
మూడు శరీరాలు కాదు...
మూడు ఉరిమే మేఘాలు
మెరుపుల్ని మింగేశాయి..!

మూడు అగ్నిపర్వతాలు
ఉరితాళ్లను శివలింగాలుగా
ఆలింగనం చేసుకున్నాయి...
అది విప్లవం జన్మించిన యజ్ఞవేదిక..!

భగత్ సింగ్
ఒక విప్లవ జ్వాల...
ఒక జ్వాలల జాతర...
సుఖదేవ్ ఒక సంకల్ప సునామీ...
అచంచల దీక్షకు ప్రతిరూపం
రాజ్ గురు ...ఒక రక్తతర్పణ దీపం...
చేసే రణరంగ రుద్రతాండవం..!

బ్రిటిష్ బానిసపు ఇనుప సంకెళ్లు
వారి జ్వాల ముందు తెగిన దారాలే...
వారి సాహసానికి చీలిన చీకటి తెరలే..!

మృత్యువు తలుపు తట్టకమునుపే
స్వాగతించిన వీర విస్ఫోటాలు..!
మృత్యువుకే ముక్తహాసం నేర్పిన
మృత్యుంజయ వీరులు వారు..!

వారి రక్తం...

భారత్ మట్టిలో పడిన విత్తనం కాదు
అది స్వేచ్ఛగా మొలిచిన జ్వాలావృక్షం..!
వారి ఊపిరి స్వాతంత్ర్యపు శంఖారావం.!

ప్రతి భారతీయుని గుండెగుడిలో
ఇప్పటికీ ఎప్పటికీ మండేగుప్తాగ్ని వారు..!

మన ఊపిరి....వారి ఋణం...
మన స్వేచ్ఛ.....వారి బలిదానం..
మన అడుగు...వారి అగ్నిపథం...
మన మార్గం....వారి ధర్మపథం...!

వంగి నమస్కరించడం కాదు
రగిలే అగ్ని గుండాలు వారు
శిరస్సులు వంచడం కాదు గర్వంగా
ఎగిరే జాతీయ జెండాలు వారు..!

ఓ అమర వీరులారా...!
మీ త్యాగం కాలానికి కట్టుబడి లేదు
అది శాశ్వతంగా ప్రజ్వలించే జాతిజ్వాల..!

ఓ విప్లవ వీరులారా...!
కాలం మీ పేర్లను చెరపలేదు...
చరిత్ర మీ జ్వాలలను ఆర్పలేదు...
మీకు మరణంలేదు దేశం గుండెల్లో
నిత్యం జ్వాలలై రగులుతుంటారు మీరు.!

ఓ సమర సింహాల్లారా..!
అమర్ రహే..! అమర్ రహే..!
ఓ భగత్ సింగ్ అమర్ రహే..!
ఓ సుఖదేవ్ అమర్ రహే..!
ఓ రాజ్ గురు అమర్ రహే..!

జైహింద్..! జై భారత్..!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# "కలలు కంటున్న అన్నయ్య... కష్టపడిన తమ్ముడు ఎవరు గెలిచారు?"



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఒక సాధారణ కుటుంబం కథ... కానీ అందులో దాగి ఉన్నది ఒక గొప్ప జీవిత సత్యం.
ఒక చిన్న గ్రామంలో రామయ్య అనే తండ్రి తన ఇద్దరు కుమారులతో జీవించేవాడు.
పెద్దవాడు సురేష్... చిన్నవాడు మహేష్.
సురేష్ ఎప్పుడూ కలలలోనే జీవించేవాడు.
చెట్టు కింద కూర్చుని, "ఒకరోజు పెద్ద ఇల్లు... చాలా డబ్బు... సుఖ జీవితం..." అని ఊహించేవాడు. కానీ చేతిలో పని మాత్రం ఉండేది కాదు.
మహేష్ మాత్రం ఆశతో ముందుకు సాగేవాడు.
తండ్రి దగ్గర కూర్చుని, కొత్తగా ఏదైనా నేర్చుకోవాలని ప్రయత్నించేవాడు. కంప్యూటర్‌తో పని చేయడం మొదలుపెట్టాడు. చిన్నగా వ్యాపారం ఎలా మొదలుపెట్టాలో తెలుసుకుంటూ ముందుకు వెళ్లాడు.
తండ్రి రామయ్య మాత్రం నిశ్శబ్దంగా చూస్తూ ఉండేవాడు.
ఒక రోజు ఇద్దరినీ పిలిచి ఇలా అన్నాడు:
"ఊహలు మంచివే... కానీ అవి పని చేయవు.
ఆశ ఉండాలి... కానీ అది సరిపోదు.
సాధించాలంటే... పని నీ శ్వాసలా మారాలి!"
ఆ మాటలు మహేష్ మనసులో బలంగా నిలిచిపోయాయి.
అతను రోజు రోజుకీ కష్టపడి, తన చిన్న వ్యాపారాన్ని పెంచుకుంటూ వెళ్లాడు.
కాలక్రమంలో అతను విజయవంతమైన వ్యక్తిగా మారాడు.
సురేష్ కూడా తన తప్పు గ్రహించాడు.
ఊహలు వదిలి, నిజ జీవితంలో పని చేయడం మొదలుపెట్టాడు.
చిత్రంలో ఎడమవైపు ఉన్న కష్టం... కుడివైపు ఉన్న విజయం...
మధ్యలో ఉన్నది మార్పు.

మార్మికం:
ఊహించేవాడు కాలాన్ని వృథా చేస్తాడు...
ఆశించేవాడు మొదలు పెడతాడు...
కానీ సాధించేవాడు... ప్రయత్నాన్నే జీవితం చేసుకుంటాడు.

రచన :తేరాల రాజేంద్రప్రసాద్
మీసేవ - B.J.R Nagar (గిరి నగర్ )
హైదరాబాద్ - 37
చరవాణి :9297109223

# స్టీల్ హబ్ గా ఉత్తరాంధ్ర

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



**నవతరం-శ్రీకాకుళం**

దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ అర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ ఇండియా నేడు అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ప్రారంభోత్సవం జరగడం ఎంతో ఆనందంగా ఉందనీ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు 1.5లక్షల కోట్ల పెట్టుబడితో.. 17 మిలయన్ మీ సామర్థ్యంతో లక్షమందికి పైగా ఉపాధిని సృష్టించే ఈ ప్రాజెక్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక భూమిక పోషించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సహకారం అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి కుమార స్వామి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సంస్థ యాజమాన్యాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భగత్‌సింగ్ 95వ వర్ధంతి సభ నిర్వహణ

- పిడియం ఆధ్వర్యంలో ఘన నివాళులు
- సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాట పిలుపు
- అమరుల ఆశయ సాధనకే నిజమైన నివాళి



**నవతరం -పలాస**

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ఉరికంబాన్ని ముద్దాడిన భారత విప్లవ నాయకులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవుల 95వ వర్ధంతి సందర్భంగా పిడియం ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విరసం రాష్ట్ర కార్యదర్శి రివేరా మాట్లాడుతూ, భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవులు దేశ స్వాతంత్ర్యం కోసం రాజీలేని సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకుని తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మహావీరులని పేర్కొన్నారు. వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ దోపిడీ, పీడనలేని సమసమాజ నిర్మాణం సాధించడమే వారికి నిజమైన నివాళి అవుతుందని అన్నారు. పిడియం రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సామ్రాజ్యవాద విధానాలపై పోరాటం కొనసాగించాలని, భగత్‌సింగ్ చూపిన మార్గంలో నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్రాల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎస్. వీరాస్వామి అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముందు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవులు, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిడియం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిడియం రాష్ట్ర అధ్యక్షులు జె. వెంకట్రావు, సిఎల్సి రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్రి థానేష్, పీకేఎస్ జిల్లా కార్యదర్శి దుర్యోధన, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ఏబిఎంఎస్ జిల్లా అధ్యక్షులు కోదండం, కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక కమిటీ కన్వీనర్ కె. వాసు, డిటిఎఫ్ ధర్మారావు, అరసం కృష్ణ, రైతాంగ నాయకులు టి. అజయ్‌కుమార్, స్వేచ్ఛ మహిళా సంఘం నాగమణి, కళాకారులు ఈశ్వరరావు, గణపతి, గంగయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల సమస్యలపై బీసీవై పార్టీ వినతిపత్రం



- కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఐదు డిమాండ్ల సమర్పణ
- "ఇవి 5 డిమాండ్లు కాదు... 5 కోట్ల భవిష్యత్తు"
- ఏప్రిల్ 11న ఆమరణ నిరాహార దీక్ష హెచ్చరిక

**నవతరం-శ్రీకాకుళం**

బీసీల సమస్యల పరిష్కారం కోసం బీసీవై పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. పార్టీ వ్యవస్థాపకుడు బోడే రామచంద్ర యాదవ్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ముందు ఐదు ముఖ్య డిమాండ్లు ఉంచామని, "ఇవి 5 డిమాండ్లు కాదు... 5 కోట్ల మంది భవిష్యత్తు" అని తెలిపారు.
ప్రధాన డిమాండ్లు: బీసీ రక్షణ చట్టం అమలు, రాజధానిలో 1000 ఎకరాల భూమి కేటాయింపు, కార్పొరేషన్లకు నిధులు, సమగ్ర కుల గణన, బీసీలకు 44% రిజర్వేషన్లు.
ఈ డిమాండ్లపై మార్చి 31లోపు స్పందించకపోతే, ఏప్రిల్ 11న ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాయితి వెంకటరమణ, సేపాన శ్రీనివాసరావు, పాలిని ప్రసాద్, బొడ్డ కృష్ణారావు, ధర్మాన వెంకటరమణ, బడ్డీ మురళి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నవతరం-శ్రీకాకుళం**

స్థానిక పెద్దపాడు సమీపంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను బాలవాటిక-3, ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ షోయబ్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఏప్రిల్ 2వ తేదీలోగా ఆన్‌లైన్ (https://admission.kvs.gov.in/) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే 2 నుంచి 9వ తరగతి వరకు గల ఖాళీలకు ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు సమర్పించవచ్చని, ఇతర వివరాలకు పాఠశాల వెబ్‌సైట్‌ను చూడాలని ఆయన పేర్కొన్నారు.

# అణగారిన వర్గాల విద్యా ప్రదాత దొమ్మేటి వెంకటరెడ్డి



జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**నవతరం-శ్రీకాకుళం**

వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి, ముఖ్యంగా శెట్టిబలిజ సామాజిక వర్గ విద్యా వికాసానికి దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొమ్మేటి వెంకటరెడ్డి 173వ జయంతి మహోత్సవంలో ఆయన వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు.
అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..18వ శతాబ్దంలో సమాజంలో నెలకొన్న అంటరానితనం, నిరక్షరాస్యతను రూపుమాపేందుకు వెంకటరెడ్డి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కష్టపడే తత్వం, సామాజిక స్పృహ ఉన్న వెంకటరెడ్డి వంటి మహనీయుల జీవిత చరిత్ర నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిని అనురాధ, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# యువత ఉన్నత చదువులతో పాటు, అన్ని రంగాల్లో ముందుండాలి

## - సమాజానికి ఉపయోగపడే చిత్రాలను అందించాలి
## - బిజిఆర్ ఫౌండేషన్ బరాటం.శ్రీనివాస చక్రవర్తి

**నవతరం-శ్రీకాకుళం**



స్థానిక పీఎన్ కాలనీ 3వ దరిలో పికె ఎంటర్టైన్మెంట్ నూతన సినిమా ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ స్టూడియోను ఘనంగా ప్రారంభించిన విషయం విదితమే. ఇందులో భాగముగా పికె ఎంటర్టైన్మెంట్ సతివాడ ప్రసాద్, కుమారి, కీర్తి, హర్షవర్ధన్, సామాజిక సేవకులు ఉర్లం.శివతేజ పట్నాయక్ తదితర బృందం ప్రముఖ విద్యావేత్త, బిజిఆర్ ఫౌండేషన్ అధినేత, కాకినాడ ఆదిత్య కళాశాలల అధినేత బరాటం.శ్రీనివాస చక్రవర్తిని సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని, చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ ప్రేమికులకు, ముఖ్యంగా యువతకు సినీ రంగంలో మంచి అవకాశాలు కల్పించడానికి పికె ఎంటర్టైన్మెంట్ దృఢ సంకల్పంతో అడుగులు వేస్తున్నారని, బీజేపీ నాయకులు, ఏబిబిఎస్ నేషనల్ కన్వీనర్, నరసన్నపేట ఇన్చార్జ్, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభియాన్ శిక్షణ కన్వీనర్ పోకతోట సింహాచలం, శ్రీకాకుళం పట్టణ తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్, ఉంగటి రమణ మూర్తి, తదితరులు పాల్గొని స్టూడియోను ప్రారంభించటం ఆనందదాయకమన్నారు. యువత ఉన్నత చదువులతో పాటుగా, అన్ని రంగాల్లో ముందుండాలని, సమాజానికి ఉపయోగపడే చిత్రాలను, సందేశాత్మక చిత్రాలను అందించాలని ఆకాంక్షించారు. అనంతరం బరాటం.శ్రీనివాస చక్రవర్తి కు జ్ఞాపికను అందించి, పికె ఎంటర్టైన్మెంట్ బృందానికి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# " కావ్యసుధ" కు ఉగాది పురస్కారం



ఆధ్యాత్మిక సాహితీవేత్త, ఆధ్యాత్మిక వ్యాస భూషణ్, ప్రముఖ కవి " కావ్యసుధ" కు హైదరాబాద్ శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ మరియు జి ఎస్ ఆర్ మరియు ఫ్రెండ్స్ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో 26 గురువారం కళా లలిత కళావేదిక త్యాగరాజ గానసభలో శ్రీ పరాభవ నామ ఉగాది ప్రతిభా పురస్కార ప్రధానోత్సవం. ప్రముఖ రచయిత్రి, ప్రపంచ పర్యాటకురాలు డాక్టర్ నర్మదా రెడ్డి, ప్రముఖ రచయిత ఆధ్యాత్మికవేత్త శ్రీ సద్గురు దామోదరచార్య, సీరియల్ దర్శకుడు రాజ్ మురారి, రేడియో జాకీ మిమిక్రీ ఆర్టిస్ట్ గాయకులు మల్లేష్ గార్లకు ఉగాది పురస్కారాలను మానస ఆర్ట్ థియేటర్స్ ప్రధాన కార్యదర్శి 'రఘుశ్రీ' ప్రకటించారు.

# దివంగత రచయిత భావశ్రీకి సాహితీ రత్నపురస్కారం



**నవతరం-జి.సిగడాం**

ఈ మండలం సంతవురిటికి చెందిన ప్రముఖ రచయిత దివంగత భావశ్రీకి శిష్టకరణ సాహితీ సేవా రత్న పురస్కారాన్ని ప్రకటించారు.ఈ మేరకు విశాఖపట్నం రామ్ నగర్ వి.ఎం.ఆర్.డి.ఎ కన్వెన్షన్ హాల్లో దివంగత అమ్మాజమ్మ, సూర్యప్రకాశరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో దివంగత భావశ్రీ కుమారుడు వాండ్రంగి రామ్ జీకి పి.ఆర్.సి.ఎ ముఖ్య సలహాదారు, కార్యదర్శి కె.వి.ఎస్.నాగేశ్వరరావు,సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్, రాష్ట్ర శిష్ట కరణ కార్పొరేషన్ మాజీ అధ్యక్షురాలు అనూషాపట్నాయక్ ఈ అవార్డును అందజేశారు.
దివంగత ప్రముఖ రచయిత భావశ్రీని గుర్తుంచుకొని సాహితీ సేవా పురస్కారాన్ని అందజేయడం పట్ల నామ విజ్ఞాన వేత్త వాండ్రంగి కొండలరావు, జిల్లా తెలుగు రచయితల వేదిక అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు,రఘుపాత్రుని వెంకట రమణమూర్తి హర్షం ప్రకటించారు.

# జల ఔషధాన్ని వృధాకానివ్వకండి

## - పోలవరం ప్రాజెక్ట్ పర్యవేక్షణ ఇంజినీర్ డోల.తిరుమలరావు
## - వంశధార ప్రాజెక్ట్ కార్యాలయంలో జల దినోత్సవ వేడుకలు

**నవతరం-శ్రీకాకుళం**



జల ఔషధాన్ని వృధాకానివ్వకండని, పోలవరం ప్రాజెక్ట్ పర్యవేక్షణ ఇంజినీర్ (నాణ్యతా ప్రమాణాలు విభాగం) డోల తిరుమలరావు అన్నారు. శ్రీకాకుళం వంశధార ప్రాజెక్ట్ కార్యాలయంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆఫ్ ఇండియా పూర్వపు చైర్మన్ ప్రొఫిసర్ డివిష్ణుమూర్తి సారధ్యంలో ప్రపంచ జల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. నూతన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆఫ్ ఇండియా చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన మొదటి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడటం.. నీటిని సద్వినియోగం చేయటం.. నీటిని దుర్వినియోగం కాకుండా కాపాడే బాధ్యత చేపట్టడం.. నీటిని కలుషితం కాకుండా కాపాడటం ఈ ఏడాది ప్రపంచ జల దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఆదివారం ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ఇంజినీర్స్ పాల్గొన్నారు.. ప్రపంచ వ్యాప్తంగా నీటి దినం వేడుకలు జరుగుతున్నాయని.. మన చుట్టూ ఉన్న నీటి వనరులు కాపాడుకోవటం.. మహిళలకు నీటి భారాన్ని తగ్గించడం.. అందరకీ సమానంగా నీరు అందేలా చూడటం వంటివి మన లక్ష్యాలు కావాలన్నారు.. నీరు సక్రమంగా ప్రవహించే చోట జీవితాలు వికసిస్తాయని, సమానత్వం పెరుగుతుందని అన్నారు.. పంచ భూతాల్లో జలం ఒకటని.. దీన్ని గ్రహించి జలాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతగా భావించాలి అన్నారు... అనంతరం పూర్వపు చైర్మన్ ప్రొఫిసర్ డి.విష్ణుమూర్తి ని దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమంలో రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఎన్. రాంబాబు, స్టేట్ ఎక్జిక్యూటివ్ మెంబర్ ముని.శ్రీనివాస్, రిటైర్డ్ సూపెర్నెంట్ ఇంజినీర్ ,ఎస్ వి రమణ,పాపారావు, సంతోష్ రాజ్ ,మన్మధరావు , డాక్టర్ వాని, రామ లక్ష్మీ, ప్రొఫిసర్ డాక్టర్ రాత్, ఢిల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

# ఐతం అధ్యాపకులు పోస్ట్ డాక్టోరల్ పరిశోధనకు ఎంపిక

## డైరెక్టర్ ప్రొ వి వి నాగేశ్వరరావు

**నవతరం టెక్కలి**




ఐతం ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మాదిన జయంతి రావు డాక్టరేట్ పూర్తి చేసి,ఉన్నత స్థాయి పరిశోధనలు కు బేరహంపూర్ కు చెందిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పోస్ట్ డాక్టోరల్ కు ఎంపికయ్యారని, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు తెలిపారు. ఈ పరిశోధన లు ఏడాది పాటు కొనసాగించనున్నారని డైరెక్టర్ పేర్కొన్నారు.అందుకు గాను భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఫెలో షిప్ (ఆర్థిక సహాయం) అందించనున్నట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా డా. జయంతి రావు కు ప్రిన్సిపల్ డా ఎ.ఎస్. శ్రీనివాసరావు డీన్ ఆఫ్ అకాడమిక్స్ డా బి.వి. రమణ,ఆర్ అండ్ డి డీన్ డా డి. శ్రీ రాములు కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా వై. రమేష్, ఐ టి హెడ్ డా బి. రమేష్ నాయుడు, డా నాగేశ్వరావు, సహచర అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

# దాట్ల లింగమూర్తికి నివాళులర్పించిన డిసిసి అధ్యక్షులు

**నవతరం -కోటబొమ్మాళి**



కోటబొమ్మాళి మండలం, కొత్తపేట గ్రామం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీర్తిశేషులు దాట్ల లింగమూర్తి గారికి ఈరోజు డిసిసి అధ్యక్షులు సనపల అన్నాజీ రావు గారు, కోత మధుసూదన్ రావు గారు మామిడి సత్యనారాయణ గారు కోత శంకర్రావు గారు పలువురు కాంగ్రెస్ నాయకులు కోటబొమ్మాళి మండలంలో కొత్తపేట గ్రామంలో ఉన్న వారి నివాసానికి వెళ్లి నివాళు లర్పించిరి,పార్టీతో మమేకమై, కాంగ్రెస్ సిద్ధాంతాలను తూచా తప్పకుండా పాటించిన వ్యక్తి, అందరితోనూ కలిసిపోయే మనస్తత్వం, రాజకీయ అనుభవజ్ఞులు, కాంగ్రెస్ పార్టీకి కష్ట కాలంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా ఆయన చేసిన సేవలు మరువలేనివి, దాట్ల లింగమూర్తిగారు మరణించడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు ఈరోజు వారి కుటుంబ సభ్యుల పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# కార్గో ఎయిర్పోర్ట్కు భూమి ఇవ్వం... బిడిమి రైతుల నిరసన

## - నల్ల రిబ్బన్లతో ఆందోళన ప్రారంభం
## - "సెంటు భూమి కూడా ఇవ్వం" రైతుల స్పష్టం
## - ప్రాణాలు ఇస్తాం కానీ భూమి వదులం

**నవతరం-మందస**

కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా బిడిమి గ్రామ రైతులు నల్ల రిబ్బన్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు పిలుపు మేరకు మార్చి 23 నుంచి 31 వరకు నిరసనలు నిర్వహించనున్నారు.
ఈ సందర్భంగా రైతు దున్న హరికృష్ణ మాట్లాడుతూ, గత 18 నెలలుగా గ్రామంలో ప్రతి నిరసన కార్యక్రమంలో పాల్గొంటున్నామని తెలిపారు. ఇప్పటికే అధికారులు నిర్వహించిన సమావేశాల్లో కూడా "ఒక్క అంగుళం భూమి కూడా ఇవ్వం" అని స్పష్టం చేసినట్లు చెప్పారు. మా పచ్చని పంట పొలాల్లో ఎయిర్పోర్ట్ నిర్మాణం చేపట్టవద్దని, జీవనాధారమైన భూమిని కోల్పోవాల్సిన పరిస్థితి తలెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే ప్రాణాలు ఇస్తామని, కానీ భూమిని వదులుకోమని హెచ్చరించారు.



ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్టి ధర్మారావు, పోరాట కమిటీ నాయకులు లండ రామస్వామి, జోగి అప్పారావు, బత్తిని లక్ష్మణ్ తదితరులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**